సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



అప్పులపై తప్పుడు మాటలు

హన్మకొండ: రాష్ట్ర అప్పులపై సీఎం, మంత్రులు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. - 8లో▸



వైద్యరంగానికి భారీగా నిధులు

ప్రభుత్వం వైద్యరంగానికి భారీగా నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం భూపాలపల్లిలో అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $28^0/14^0$

జిల్లాలో ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వాతావరణం సాధారణంగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురియంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కోనోకార్పస్ చెట్ల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

తొర్రూరు: పర్యావరణానికి విఘాతంగా మారుతున్న కోనోకార్పస్ చెట్లపై 'పిట్ట వాలని చెట్టు..' శీర్షికన నవంబర్ 9న 'సాక్షి'లో కథ నం ప్రచురితమైంది. దీంతో కోనోకార్పస్ చెట్ల పెంపకంపై సమాలోచన జరిపిన మున్సిపాలిటీ అధికారులు సుందరీకరణ పేరిట డివైడర్లపై నాటిన కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియను శనివారం ప్రారంభించారు. తక్కువ సమయంలో గుబురుగా ఆకర్షణీయంగా కనిపించే ఈ మొక్కల పుప్పొడి ఆరోగ్యానికి హానికరమని భావించి ప్రజల తరఫున సాక్షి పత్రిక కథనం ప్రచురించింది. దీంతో పత్రికా కథనంతో పట్టణవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మెయిన్ రోడ్డు, అన్నారం రోడ్డులో కోనోకార్పస్ చెట్లు తొలగించి వాటి స్థానంలో ఇతర అలంకరణ మొక్కలు నాటుతామని కమిషనర్ శాంతికుమార్ తెలిపారు.

ఎస్పీ, జడ్జి చిత్రపటాలకు పాలాభిషేకం



మహబూబాబాద్ రూరల్ : ఇంజనీరింగ్ కళాశాలలో సీటు ఇప్పిస్తామమని చెప్పి ఓ దళారి తీసుకున్న డబ్బులను లోక్‌అదాలత్ ద్వారా ఇప్పించినందుకు ఓ వ్యక్తి ఎస్పీ, జడ్జీ చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. కురవి మండలం గుండ్రాతిమడుగు (విలేజ్)కు చెందిన పత్తి వెంకన్న తన కుమారుడికి హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు కోసం మేడ్చల్ జిల్లాకు చెందిన కొండల్ రెడ్డి అనే దళారికి రూ.2 లక్షలు ఇచ్చాడు. సీటు ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో అతనిపై కురవి పోలీస్ స్టేషన్‌లో వెంకన్న ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై సతీష్ చొరవతో శనివారం జిల్లా కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో ఇరువురి మధ్య రాజీ కుదిర్చి కేసు పరిష్కరించి, డబ్బులను ఇప్పించారు. దీంతో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి తిరుపతి చిత్రపటాలకు వెంకన్న పాలాభిషేకం చేశాడు.

'కేసీ'ని కలిసిన ఎమ్మెల్యే



మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యుడు కేసీ.వేణుగోపాల్‌ను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శనివారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

వెరైటీ..

ఆరోగ్య రక్షణకు రకరకాల తేనీరు

- మితంగా తీసుకుంటేనే ఆనందం
- లేదంటే అనారోగ్యం
- నేడు వరల్డ్ 'టీ' డే



రోజూ ఉదయం నిద్ర లేవగానే కప్పు టీ తాగనిదే దినచర్య మొదలు కాదు. ఉల్లాసం ఇచ్చేది.. ఒత్తిడి నుంచి సేదతీర్చేది తేనీరే (టీ). నలుగురూ ఓ చోట కలిసినా.. ఇంటికి బంధువులొచ్చినా మర్యాద పూర్వకంగా ఇచ్చేదీ తేనీరే. పూర్వీకులు తేయాకుతో చేసిన 'టీ' మాత్రమే తాగేవారు. ప్రస్తుతం రకరకాల వెరై'టీ'లు లభ్యమవుతున్నాయి. నేడు(ఆదివారం)అంతర్జాతీయ 'టీ' దినోత్సవం సందర్భంగా తాగితే కలిగే ప్రయోజనాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. - కాజీపేట

ఇన్‌స్టంట్ ఎనర్జీనిచ్చే ద్రవ పదార్థాల్లో 'టీ'ది ఎప్పుడు ఉన్నత స్థానమే. అందుకే చాయ్‌ని నమ్ముకుని దేశంలో దాదాపు 50 లక్షల మంది కుటుంబాల్ని పోషిస్తున్నారు. టీ తాగితే లాభాలతోపాటు కొన్ని నష్టాలు కూడా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. రోజూ రెండు కప్పుల టీ తాగితే ఎలాంటి ప్రమాదం ఉండదని డాక్టర్లు నిర్ధారిస్తున్నారు. 'టీ'లో ఉండే కెఫిన్ శరీరాన్ని ఉత్తేజపరుస్తుంది. పోలీఫినాల్స్ ఉన్నందున స్త్రీలలో రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది. ఊపిరితిత్తుల కేన్సర్, జీర్ణనాళంలోని పలు భాగాలకు వచ్చే కేన్సర్లకు విరుగుడుగా పని చేస్తుంది.



టీలో రకాలెన్నో..



చాయ్‌లో అనేక రకాలున్నాయి. అల్లం, బెల్లం, లెమన్ గ్రాస్, తులసి, లెమన్, గ్రీన్ టీ, బ్లాక్, మసాలా, బాదాం, రోస్ టీ, తులసి, పుదీన, లెమన్ గ్రాస్ ఇలా చాలా రకాల చాయ్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. గ్రేటర్ వరంగల్‌లో ప్రత్యేకంగా చాయ్‌ని బ్రాండ్‌తో అమ్ముతున్నవారు సైతం పదుల సంఖ్యలో ఉన్నారు.

ఉపశమనం కోసం...



ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి టీ తాగడానికి ఎక్కువ మంది వస్తుంటారు. రోజుకు 500 మందికిపైగా మా వద్ద చాయ్ తాగుతారు.

- బానోత్ బాలాజీ, టీ తయారీదారుడు, కాజీపేట

ఎవరు కలిసినా టీ తాగుతాం..



ఉదయం నుంచి మొదలు.. నిద్రపోయే వరకు దాదాపు పదికి పైగా చాయ్‌లు తాగుతుంటా. మిత్రులు ఎవరు కలిసినా టీ తాగడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటికి బంధువులొస్తే మర్యాద పూర్వకంగా టీ ఇస్తాం.

- తేలు సారంగపాణి, కాజీపేట

చిన్న కప్పు చాలు..



ఖాళీ కడుపుతో టీ తాగొద్దు. కాసిన్ని నీళ్లు తాగాకే తేనీరు సేవించాలి. అల్లం టీ, యాలకుల టీ, మసాలా టీ, లెమన్ గ్రాస్ టీ వంటివి ఆరోగ్యానికి చాలా మంచిది. రోజుకు రెండు చిన్న కప్పుల 'టీ' తాగితే మంచిది. ఎక్కువసార్లు చాయ్‌తాగే వారిలో ఆకలి తగ్గుతుంది. ఎసిడిటీ సమస్య వస్తుంది.

- డాక్టర్ మధులత, కాజీపేట

నేడే గ్రూప్-2 పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 7,470 మంది అభ్యర్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో నేడు, రేపు(15, 16తేదీల్లో) నిర్వహించే గ్రూప్ -2 పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 7,470 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం 21 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ గుర్తింపు కార్డులతో, అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం అలస్యమైనా కేంద్రంలోనికి అనుమతించేదిలేదని అధికారులు వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒక పేపర్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు మరో పేపర్ పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం గేట్లు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2:30 గంటలకు మూసివేస్తారు. ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు, ఫోన్లు తీసుకురావొద్దని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలుల్లో ఉంటుంది. 21మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు 24, అబ్జర్వర్లు 23, రూట్ ఆఫీసర్స్ నలుగురు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10, బయోమెట్రిక్ అధికారులు 55, ఐడెంటిఫికేషన్ అధికారులు 86 మంది విధులు నిర్వహించనున్నారు. పరీక్ష సెంటర్లకు నిరంతరం విద్యుత్, మంచినీరు సౌకర్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంటాయి.



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు రాస్తున్న సిబ్బంది

21 పరీక్ష కేంద్రాలను 6 రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌కు ఒక్కో జాయింట్ రూట్ ఆఫీసర్‌ను నియమించినట్లు అధికారులు తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, 86 మంది బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లను నియమించారు.

పటిష్టమైన బందోబస్తు



జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలుల్లో ఉంటుంది. ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు, లౌడ్ స్పీకర్లు పరీక్ష కేంద్రాల వద్ద ఉంటే మూసివేయాలి. 500 మీటర్ల సమీపంలో ప్రజలు గుమిగూడ వద్దు, నలుగురు డీఎస్పీలు, 10మంది సీఐలు, 20లు ఎస్సైలు, ఏఎస్సైలు 21 మంది, కానిస్టేబుళ్లు, హోమ్ గార్డులు కలిపి సుమారు 200 మంది బందోబస్తులో ఉంటారు.

- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సురేశ్



మాట్లాడుతున్న జడ్జి సురేశ్

మహబూబాబాద్ రూరల్: కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సురేశ్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించగా సీనియర్ సివిల్ జడ్జి సురేశ్ ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారుల సమన్వయంతో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ పరిష్కారం చూపెడుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి తిరుపతి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ తిరుపతిరావు, ఎస్‌బీఐ ఆర్ఎం అబ్దుల్ రహీం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. శనివారం 1,801 కేసులు పరిష్కారం కాగా.. రెండు మోటారు వాహనప్రమాద కేసుల్లో బాధితులకు రూ.18.75లక్షలు చెల్లించేలా ఆదేశించారు. మరో 1,799 కేసులు పరిష్కారంతోపాటు, వివిధ కేసుల్లో రూ.91,44,658 జరిమానా విధించారు.

తొర్రూరు: జాతీయ లోక్ అదాలత్‌తో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సరిత అన్నారు. శనివారం తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,450 కేసులు పరిష్కరించి, కక్షిదారులకు రూ.19.79లక్షల పరిహారమందించారు.

శివనామస్మరణతో మార్మోగిన రామప్ప

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయం శనివారం శివనామస్మరణతో మార్మోగింది. రామప్ప దేవాలయానికి వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, పర్యాటకులు అధికసంఖ్యలో వచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మరిపెడ సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభం

మరిపెడ/మరిపెడ రూరల్: పేద విద్యార్థుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మరిపెడ మండల కేంద్రంలోని టీజీఎస్‌డబ్ల్యూ బాలికల స్కూల్, జూనియర్ కళాశాల నర్సింహులపేట, సోషల్ వెల్ఫేర్ గురుకుల, జూనియర్ కళాశాల, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంక్షేమ హాస్టళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ ప్లాన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మరిపెడలోని తెలంగాణ సాంఘికసంక్షేమ గురుకులపాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ మంత్రి భోజనం చేశారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో ఒకే విధమైన డైట్ ప్లాన్ ప్రారంభించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా డైట్‌చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని పాఠశాలల్లో రూ.667.27కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించిందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ధనిక రాష్ట్రాన్ని ఆనాటి ప్రభుత్వం అప్పులపాలు చేస్తే ప్రతి నెలా రూ.6వేల కోట్లకుపైగా మిత్తి చెల్లిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని చేపడుతున్నామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన విప్ రాంచంద్రునాయక్, కలెక్టర్, ఎస్పీ

ఆరు గ్యారంటీలు అమలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం.. ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇళ్లులేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆరోగ్య తెలంగాణ, విద్యా తెలంగాణగా రూపొందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

విద్యకు అత్యంత ప్రాధాన్యత : ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పెంచిన చార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందన్నారు. ఇదిలా ఉండగా.. దంతాలపల్లి, సీరోలు, నర్సింహులపేట మండలాలకు కేటాయించిన 108 వాహనాలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తో కలిసి మరిపెడ పీహెచ్‌సీ ఆవరణలో ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీ స్టాక్ రూంలోని మందులు పరిశీలించారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, డీఎంహెచ్‌ఓ మురళీధర్, ప్రిన్సిపాల్స్ దయాకర్, సోమోజి, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ విజయ, ఆర్ఐ శరత్, ఎంఈఓ అనితాదేవి, మెడికల్ ఆఫీసర్ రవి తదితరులున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- డీఈఓ రవీందర్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

నెల్లికుదురు: మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి చదువుతోపాటు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం రాష్ట్ర స్థాయి నెట్ బాల్, తాంగ్ తా పురుషుల క్రీడా పోటీలను ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయుడు చెడుపల్లి అయిలయ్యతో కలసి డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి 27వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బా పట్టణంలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో తెలంగాణ 10 జిల్లాల నుంచి 240 మంది పాల్గొనే క్రీడల్లో 100 మంది అధికా రులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా నెల్లికుదురు మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడాకారులకు భోజన సౌకర్యం, విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు సోమారపు ప్రవీణ్, ఇమామ్, కొమురయ్య, శంకర్ పాల్గొన్నారు.





రంజిత్‌కుమార్‌కు నృత్య తపస్వి అవార్డు


అవార్డు అందుకుంటున్న రంజిత్‌ కుమార్‌

హన్మకొండ కల్చర్‌: పేరిణి నాట్యాచార్యుడు గజ్జెల రంజిత్‌కుమార్‌ నృత్య తపస్వి అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌ 15న హైదరాబాద్‌ రవీంద్ర భారతి వేదికగా పేరిణి నాట్యం చేయడంతో పాటు పరిశోధానాత్మకంగా విశేష సేవలు అందిస్తున్న గజ్జెల రంజిత్‌ కుమార్‌ను ఏలూరు అభినయ నృత్య భారతి నృత్య తపస్వి–2023 అవార్డుకు ఎంపిక చేసింది. శుక్రవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో అభినయ నృత్య భారతి అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిలిం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ అంబికా కృష్ణ, అభినయ నృత్య భారతి అధ్యక్షుడు మనోహర్‌ గోపాల్‌ లునాని, ఇతర ప్రతినిధులు పేరిణి నాట్యాచార్యుడు గజ్జెల రంజిత్‌కుమార్‌కు నృత్య తపస్వి–2023, భారత కళాప్రపూర్ణ కోదాడ నరసింహారావు స్మారక జాతీయ అవార్డు అందించి ఘనంగా సన్మానించారు.

భవిష్యత్‌ ‘కమ్యూనిస్టులదే’

- సీపీఎం జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మాట్లాడుతున్న వీరభద్రం, చిత్రంలో పోతినేని

హసన్‌పర్తి : అంతర్జాతీయ రాజకీయాలను పరిశీలిస్తే కమ్యూనిస్టులకు భవిష్యత్‌ ఉన్నట్లు అర్థమవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం హనుమకొండ జిల్లా రెండో మహాసభలు మండల కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అధ్యక్షత వహించగా వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారానే శ్రీలంక వంటి చిన్నదేశంలో కమ్యూనిస్ట్‌ నేత అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు గుర్తు చేశారు. కేంద్రంలోని మోదీ.. రాష్ట్రంలో రేవంత్‌ సర్కార్‌ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితుల్లో లేవని, ఎర్రజెండా నాయకత్వంలో పోరాడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. హనుమకొండలో జరిగిన భూపోరాటం అత్యంత కీలకమైందన్నారు. కేసీఆర్‌ కుటుంబపాలనతో విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధిచెప్పారని పేర్కొన్నారు. లగచర్ల ఫార్మాసిటీ రద్దు ఎర్రజెండా విజయమేనని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహాసభ సందర్భంగా హసన్‌పర్తి బస్టాండ్‌ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎం.చుక్కయ్య, రమేశ్‌, వీరన్న, వెంకట్‌, రాములు, తిరుపతి, దీప, సంపత్‌, సాంబయ్య పాల్గొన్నారు.



మంచి అన్నం పెట్టే బాధ్యత మాది..

చదివే బాధ్యత మీది

- మీకు ఏ ఇబ్బంది వచ్చినా నాకు తెలపండి
- గురుకులంలో విద్యార్థులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ సోషల్‌ వెల్ఫేర్‌ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి

సాక్షి, మహబూబాబాద్‌ : ‘మీరందరూ పేదల పిల్లలు. మీ భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని గురుకులాలకు పంపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్‌, కాస్మొటిక్‌ చార్జీలు పెంచకుండా పిల్లలు పస్తులుంటే చూసుకుంటూ పదేళ్లు పాలించిన పాపం బీఆర్‌ఎస్‌ది. ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. పోషకాలు, బలవర్ధకమైన భోజనం పెట్టే బాధ్యత మాది.. మంచిగా చదువుకొని ఉన్నతులుగా తయారయ్యే బాధ్యత మీది.. దీనికి సిద్ధమే కదా.. అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. శనివారం మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ సోషల్‌ వెల్ఫేర్‌ ఆశ్రమ పాఠశాలలో న్యూ కామన్‌ డైట్‌ మెనూ చార్టును మంత్రి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో చిట్‌..చాట్‌ చేశారు.

మంత్రి: అందరూ బాగున్నారా.. ? ఆకలి అవుతుందా.. ? కలిసి అన్నంతిందాం..
విద్యార్థులు: బాగున్నాం సార్‌.. అన్నం తిందాం సార్‌..
మంత్రి: నా పేరు తెలుసుకదా.. మరి మీపేరేంటి.. మీదేవూరు.. ఏం చదువుతున్నారు..?
విద్యార్థులు: తెలుసు సార్‌.. మా పేరు విజేందర్‌, మారిన్‌, ఆకాశ్‌(ఒక్కొక్కరుగా) దంతాలపల్లి, గూడూరు.. ఏడో తరగతి చదువుతున్నాం .. మన అమ్మానాన్నలు కూడా వచ్చారు.
మంత్రి: బాగా చదువుతున్నారా..? పెద్దయ్యాక ఏం అవుతారు..?
విద్యార్థులు: బాగా చదువుతున్నాం.. డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్‌, కబడ్డీ ప్లేయర్‌ అవుతాం సార్‌..
మంత్రి: అమ్మో.. మంచి టార్గెటే... కానీ నేను ఎలా నమ్మాలి.. ? అయినా మీ మీద నమ్మకం కుదురుతుంది.. మాట తప్పొద్దు సుమా.. మంచి భోజనం, చికెన్‌, మటన్‌ పెట్టే భారం మాది.. మంచిగా చదివే బాధ్యత మీది.. మాట తప్పొద్దు.. మీకు ఏ ఇబ్బంది వచ్చినా నా దృష్టికి తెండి. ఓకేనా.. ఇక అన్నం తిందాం..

‘ముకుంద’ జువెల్లర్స్‌ ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ముకుంద జువెల్లర్స్‌ మొదటి ఫ్యాక్టరీ ఔట్‌లెట్‌ షోరూంను శనివారం వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ రెడ్డి నీలిమారెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఫ్యాషన్‌ ప్రపంచాన్ని అందిపుచ్చుకుని బంగారు ప్రియులకు అనుగుణమైన డిజైన్లతో కూడిన ఆభరణాలను అందుబాటులో ఉంచాలన్నారు. వాణిజ్య, వ్యాపారాలకు హనుమకొండ కేంద్రంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ముకుంద జువెల్లర్స్‌ సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ, కొత్తపేట, సోమాజిగూడ, ఖమ్మంలో తమ బ్రాంచ్‌లను ప్రారంభించామన్నారు. తాము ఊహించిన దానికంటే ఎక్కువ సక్సెస్‌ కావడంతో హనుమకొండలో తాము నూతన శాఖను ప్రారంభించామన్నారు. కస్టమర్ల ఆదరాభిమానాలతో తమ జువెల్లర్స్‌ షోరూంలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో మరిన్ని బ్రాంచ్‌లు ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు ‘వైభవలక్ష్మి’ షాపింగ్‌ మాల్‌ ప్రారంభం

వరంగల్‌ చౌరస్తా : వరంగల్‌ జేపీఎన్‌ రోడ్డులో ఆదివారం వైభవ లక్ష్మి షాపింగ్‌మాల్‌ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి శాసన సభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌, రాష్ట్ర పంచాయతీరాజ్‌, దేవాదాయ శాఖ మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు డైరెక్టర్లు లలిత్‌, ప్రదీప్‌ కుమార్‌, బజాజ్‌, సూరజ్‌, సరడ, పి.రిషిత పేర్కొన్నారు. అలాగే, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌ రెడ్డి, కడియం శ్రీహరి, నాగరాజు, దొంతి మాధవ రెడ్డి, శాసన మండలి వైస్‌ చైర్మన్‌ బండా ప్రకాశ్‌, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్‌ సుధారాణి, స్థానిక కార్పొరేటర్‌ గాందే కల్పన పాల్గొంటారని పేర్కొన్నారు. తమ షాపింగ్‌ మాల్‌లో అన్ని రకాలు దుస్తులు అందుబాటు ధరల్లో లభిస్తాయని తెలిపారు.

టాటా ఏస్‌, టవేరా ఢీ..

- ఇద్దరి దుర్మరణం.. ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు


ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు


యాకయ్య (ఫైల్‌)


సంపత్‌ (ఫైల్‌)

దేవరుప్పుల : జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబాయి తండా సమీపంలో జనగామ–సూర్యాపేట రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై ఊర సృజన్‌కుమార్‌ కథనం ప్రకారం.. జనగామ నుంచి సూర్యాపేట వైపునకు టాటాఏస్‌ ట్రాలీ వాహనం వెళ్తోంది. ట్రాలీలో మరిపెల్లి యాకయ్య(46), సూరపల్లి సంపత్‌(52) అనే ఇద్దరు ప్రయాణికులు నిల్చున్నారు. చింతబాయి తండా సమీపంలోకి రాగానే టాటా ఏఎస్‌ను ఎదురుగా వస్తున్న టవేరా ఢీకొట్టింది. వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. రెండు వాహనాల్లోని వారు బయటికి వచ్చే వీలులేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ఇరువాహనాల క్యాబిన్లలో ఇరుక్కున్న ఎనిమిది మందిని బయటకు తీశారు. అందరినీ చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగ్రాతుల్లో ఓ మహిళ పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలించారు. కాగా, రెండు వాహనాలను రోడ్డు పక్కకు తీసే క్రమంలో టాటాఏస్‌ వాహనం వెనుక చూడగా ఇద్దరు అక్కడికక్కడే దుర్మణం చెంది కనిపించారు. మృతుల్లో ఒకరు జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడేనికి చెందిన మరిపెల్లి యాకయ్య , మరొకరు సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి చెందిన సూరపల్లి సంపత్‌ అని గుర్తించారు. మరిపెల్లి యాకయ్య జనగామ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సర్వశిక్ష అభియాన్‌ ఉద్యోగుల దీక్షకు ఐదు రోజులనుంచి హాజరవుతున్నాడు. శనివారం కూడా హాజరై స్వగ్రామానికి వచ్చే క్రమంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో టాటా ఏస్‌ ట్రాలీలో ప్రయాణించాడు. అలాగే, సంపత్‌ కూడా స్వగ్రామానికి వెళ్లేందుకు టాటా ఏస్‌ ట్రాలీలో ప్రయాణించాడు. యాకయ్య కుమారుడు బెనహర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

అప్పులపై తప్పుడు మాటలు

- రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరిస్తే ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

హన్మకొండ: రాష్ట్ర అప్పులపై సీఎం, మంత్రులు తప్పుగా మాట్లాడుతున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌ 7న కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్రంలో రూ.3,29,499 కోట్ల అప్పులున్నాయని, తెలంగాణ ఆవిర్భావించి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 72,652 కోట్ల అప్పులో ఉందని, 18,265 కోట్ల రుణాలకు గ్యారంటీ ఇచ్చిందని వివరించారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.3,29,499 కోట్ల అప్పులు చేస్తే, కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలోనే 15,118 కోట్ల అప్పులు చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.4,28,540 కోట్ల అప్పు ఉందన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.7 లక్షల అప్పులు చేసిందని సీఎం, మంత్రులు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సీఎం, మంత్రులు అప్పులు అప్పులు అని తప్పుగా మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. 60 ఏళ్లలో అపరిష్కృతంగా సమస్యలన్నింటినీ సీఎంగా కేసీఆర్‌ పరిష్కరించి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపారన్నారు. కాంగ్రెస్‌ ఏడాది పాలనలో రాష్ట్రాన్ని అస్థిరత్వంలోకి తీసుకెళ్లారని మండిపడ్డారు. దేవతలందరిపై ప్రమాణం చేసి అబద్ధమాడిన సీఎం దేశంలో ఎక్కడా లేరని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చేయకపోవడంతో రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు. హామీల అమలుపై శాసన సభ, శాసన మండలి సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరిస్తే చూస్తు ఊరుకోమన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చల్ల ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు తాళ్లపల్లి జనార్దన్‌, మాలకుమ్మరి పరశురాములు, మోడెం ప్రవీణ్‌ పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

తొర్రూరు : చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన డివిజన్‌ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన సంగ నర్సమ్మ (95) ఇటీవల తొర్రూరులో ఉండే కూతురు ఇంటికి వచ్చింది. శుక్రవారం కూతురు ఇంటి నుంచి బయటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు గాలించగా శనివారం తొర్రూరు చెరువులో శవమై తేలియాడుతూ కనిపించింది. ఈ ఘటనపై కుమార్తె రామగిరి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌ తెలిపారు.

బస్సు కిందపడి మరో వృద్ధురాలు..


లక్ష్మి మృతదేహం

కన్నాయిగూడెం : బస్సు కిందపడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బుట్టాయిగూడెంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలోని దేవాదుల గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మి(70) కూతురు ఇంటికి బుట్టాయిగూడెం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో బుట్టాయిగూడెంలోని తాటిచెట్ల వద్ద ఏటూరునాగారం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న క్రమంలో డ్రైవర్‌ బస్సును కదిలించడంతో జారిపడడంతో టైర్‌ కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్‌ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOKEN ENGLISH

■ Beginners 90 Days, Intermediate 45 Days, Advanced 30 days, INSPIRE PROFESSIONALS, Hanamkonda. Cont: 7340094185, 8712277875, 9391622073. [W-1264107]

REAL ESTATE

TO-LET

■ 1 BHK For Rent in Revenue Colony Road No. 6 Near Ramalayam, 6500/- Cont: P. Rajender Reddy, 9849375236. [W-1264110]

■ S.V.N. Road లో కాకతీయ టాకీస్‌ ప్రక్కన Indian Bank పైన 1st floor 850" Hall ఆఫీసులకు, షాపింగ్‌లకు, చిట్‌ఫండ్‌కు కిరాయికివ్వబడును. సంప్ర॥ 9700721220 [W-1264060]

SERVICES

■ హౌస్‌, ప్లాట్‌, వ్యవసాయ భూములు మార్టిగేజ్‌ చేసుకొని అమౌంట్‌ ఇప్పించబడును. సిబిల్‌ అవసరం లేదు. సంప్ర॥ 8341479342. [WA-7547]

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్‌ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సలహాలకు సంప్రదించండి : 7297898678. [T-293]

OLD AGE HOME

■ హన్మకొండ, వడ్డెపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. సంప్రదించగలరు: 9848444020, 9110551507. [W-1264108]

IGLOO ICE CREAM

■ IGLOO ఐస్‌క్రీమ్‌ అదాలత్‌ హన్మకొండ. వివాహ శుభ కార్యములకు హోల్‌సేల్‌ రేటులో సప్లయి చేయబడును. వెనిల 220/-, బటర్‌ స్కాచ్‌ 300/-, సెల్‌ నెం: 9849165892, 9849375236. [W-1264109]

పశువుల దాణా లభించును

■ పల్లి, చెక్క, పొద్దు తిరుగుడు చెక్క, నువ్వుల చెక్క, కొబ్బరి చెక్క మరియు గానుగ నూనెలు లభించును. హనుమాన్‌ గుడి దగ్గర, రాంపూర్‌ ఇండస్ట్రీయల్‌ ఏరియా, సంప్ర॥ 9666657986. [WA-6537]

సెప్టిక్‌ ట్యాంక్‌ క్లీనర్‌

■ మీ యొక్క సెప్టిక్‌ ట్యాంక్స్‌ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్‌ మిషన్‌ ద్వారా మీ సెప్టిక్‌ ట్యాంక్స్‌ క్లీన్‌ చేయబడును. సంప్ర॥ డి.యస్‌. రావు, సెల్‌: 9849145043 [W-1264038]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్‌, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును. ఫోన్‌ : 9177555694 [SCA24000795]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్‌ శానిటరీ ప్యాడ్‌, బేబి డైపర్‌ మెషిన్‌, ప్లాస్టిక్‌ ఉద్యోగ్‌ స్థాపించండి, బైబ్యాక్‌ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011–25920179 [DA-6124]

WANTED

■ Mylabs is looking for Lab Technicians / Phlebologists in Jangaon. Experience 1-2 Years. Salary: 8-12K. Cont: 8106112401. [W-1264151]

■ రామకృష్ణ ఓల్డేజ్‌ హోం (హైదరాబాద్‌ బ్రాంచ్‌) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్‌ కొరకు M/F వర్కర్స్‌, భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్‌ ✆ 91332 71122, 95534 61177 [B-1172531]

■ రామకృష్ణ ఓల్డేజ్‌ హోం (విజయవాడ బ్రాంచ్‌) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్‌ కొరకు M/F వర్కర్స్‌, భో+ వసతి +జీతం: 15-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్‌ ✆ 95420 47788, 92814 52843 [B-1172526]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

■ శ్రీనివాస గ్రూపు, (నాగోల్‌, హైదరాబాద్‌) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్‌ కొరకు 10th ఆపైన చదివిన 20-30 సం. వయస్సు గల M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్‌ ✆ 99636 91122, 92814 65315 [B-1172528]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పెషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్‌ జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA24000827]

■ సైట్‌ సూపర్‌ వైజర్లు, సైట్‌ అకౌంటెంట్స్‌ & ఆటోమేషన్‌ కార్‌ డ్రైవింగ్‌లో అనుభవం ఉన్న డ్రైవర్స్‌ కావలెను. సంస్థ పేరు: PVC Projects, Hyd., 040-23338080, Email : adm.vineela@gmail.com. (సమయం: 10 am- 5pm Sunday - Chegunta & Monday - punjagutta) [H-804885]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్‌ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్‌ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్‌ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కుమారుడి మరణం తట్టుకోలేక తండ్రి మృతి..

- వెంకటాపురంలో ఘటన


సమ్మయ్య(ఫైల్‌)

దుగ్గొండి : ఆ ఒక్కగానొక్క కుమారుడంటే తండ్రికి ఎనలేని ప్రేమ. చిన్నప్పటి నుంచి కష్టపడి పెంచి పెద్ద చేశాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుమారుడి మరణాన్ని తట్టుకోలేక ఆ తండ్రి కూడా చనిపోయాడు. ఈ విషాదకర ఘటన వరంగల్‌ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన గోర్కటి సమ్మయ్య (62)కు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు రమేశ్‌ భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో రమేశ్‌ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తండ్రి సమ్మయ్య మనోవేదనకు గురవుతున్నాడు. మనస్తాపంతో పక్షవాతం బారిన పడ్డాడు. వరంగల్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివా రం మృతి చెందాడు. కుమారుడు రమేశ్‌ దశదిన కర్మకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో తండ్రి సమ్మయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు.

అత్తకు విషమిచ్చిన కోడలు

- చికిత్స పొందుతూ మృతి
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కుమారుడు


భూక్య గమ్మి (ఫైల్‌)

పర్వతగిరి: తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తుందని ఓ కోడలు తన అత్తకు కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించింది. అత్త చికిత్స పొందుతూ మృతిచెందగా, తన తల్లిని చంపిందని భార్యపై భర్త శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన వరంగల్‌ జిల్లా పర్వతగిరి మండలం పెద్దతండాలో చోటుచేసుకుంది. స్థానికులు, హెడ్‌కానిస్టేబుల్‌ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన భూక్య మంజుల, దేవేందర్‌ భార్యాభర్తలు. మంజుల మూడేళ్లుగా వరంగల్‌లోని పెరుకవాడకు చెందిన సారయ్య అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. విషయం అత్త భూక్య గమ్మి(55)కి తెలిసి పలుమార్లు వారించింది. దీంతో మంజుల తన ప్రేమ కలాపాలకు అత్త గమ్మి తరచూ అడ్డు వస్తుందని గతంలో రెండు సార్లు తలపై గాయం చేయగా, మరోసారి చేయి విరగ్గొట్టింది. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన మంజుల తన అత్త గమ్మికి థమ్సప్‌లో పురుగుల మందు కలిపి తాగించింది. కొద్ది సేపటి అనంతరం గమ్మి కిందపడి కొట్టుకుంటుండగా కుమారుడు దేవేందర్‌ చూసి స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించగా ఆయన సూచన మేరకు తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించే క్రమంలో శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. దేవేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యరంగానికి భారీగా నిధులు

- హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం
- గత తొమ్మిదేళ్లు నియంతృత్వ పాలన
- రాష్ట్ర మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు


బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

భూపాలపల్లి : తమ ప్రభుత్వం వైద్య రంగానికి భారీగా నిధులు కేటాయిస్తోందని, మారుమూల ప్రాంతం భూపాలపల్లికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా గణపురం, రేగొండ, భూపాలపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం భూపాలపల్లి అంబేడ్కర్‌ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ రూ. 130 కోట్లతో భూపాలపల్లిలో మెడికల్‌ కళాశాల, హాస్టల్‌ భవనానికి శంకుస్థాపన చేశామన్నారు. భూపాలపల్లికి నర్సింగ్‌ కళాశాల మంజూరు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడంతో ఎంతోమందికి ప్రయోజనం చేకూరిందన్నారు. గత ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాటు నియంతృత్వ,అహంకారపూరిత పాలన కొనసాగించిందన్నారు.

బైపాస్‌కు ప్రయత్నిస్తాం.. మంత్రి దుద్దిళ్ల

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హామీలు ఇచ్చింది కానీ నిధులు ఇవ్వలేదని, తాము రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గణపురం మండలం గాంధీనగర్‌లో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్‌ స్కూల్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. అక్కడే ఐటీ ఇండస్ట్రీని అభివృద్ధి చేస్తామన్నారు. భూపాలపల్లిలో బైపాస్‌కు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారని, ఇందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ సింగరేణి ఆసుపత్రిలోని ఖాళీ వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. భూపాలపల్లికి రింగ్‌ రోడ్డు మంజూరు చేయాలన్నారు. రామప్ప నుంచి డీబీఎం 38కు లింక్‌ కలిపి గోరికొత్తపల్లి, రేగొండ, చిట్యాల, గణపురం మండలాలకు సాగునీరు అందించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్‌ రాహుల్‌ శర్మ, ఎస్పీ కిరణ్‌ ఖరే, కాంగ్రెస్‌ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ చార్జింగ్‌ పెడుతుండగా విద్యుత్‌ షాక్‌..

- బాలుడి మృతి
- జల్లి గ్రామంలో విషాదం


రాకేశ్‌(ఫైల్‌)

చెన్నారావుపేట: సెల్‌ఫోన్‌ చార్జింగ్‌ పెడుతుండగా విద్యుత్‌షాక్‌ తగలండంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంపంగి రమేశ్‌ కుమారుడు రాకేశ్‌(16) ఇదే గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో సెల్‌ ఫోన్‌ చార్జింగ్‌ పెడుతుండగా ఒక్కసారిగా విద్యుత్‌ షాక్‌కు గురై కింద పడ్డాడు. గమనించిన బాలుడి తల్లి, చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే రాకేశ్‌ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి రమేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌ రెడ్డి తెలిపారు.

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ విజయం



కాజీపేట రూరల్‌: ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన రైల్వే వన్‌ ఇండస్ట్రీ వన్‌ యూనియన్‌ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో దేశంలోని 15 రైల్వే జోన్లలో నేషనల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ రైల్వే మెన్‌ (ఎన్‌ఎఫ్‌ఐఆర్‌) 9 జోన్లలో గెలుపొంది, 6 జోన్లలో ద్వితీయ స్థానంలో నిలిచిందని కాజీపేటకు చెందిన రైల్వే ఎంప్లాయీస్‌ సంఘ్‌ సికింద్రాబాద్‌ డిప్యూటీ డివిజనల్‌ సెక్రటరీ చింత మురళి శనివారం తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 15 రైల్వే జోన్లలో ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ను కార్మికులు ఆదరించి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌ జోన్‌లో ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ అనుబంధ సంస్థ రైల్వే ఎంప్లాయీస్‌ సంఘ్‌ 42.91 శాతం ఓటింగ్‌తో గెలిచి రైల్వే గుర్తింపు సాధించిందన్నారు.